www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబరు 2024
5
చిత్తూరు

డెంగీతో బాలిక మృతి

డెంగీతో మృతి చెందిన చిన్నారి నిజ ఫాతిమా

ప్రజాశక్తి - వికోట: మండలంలో నాలుగు రోజుల క్రితం ఓ బాలిక మృతి చెందిన సంఘటన మరువక ముందే మండల కేంద్రం వికోటలోని బాపూజీ వీధికి చెందిన బాలిక నిజ ఫాతిమా (4) డెంగీ బారిన పడి ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వికోట మండల కేంద్రంలోని బాపూజీ వీధిలో నివాసముంటున్న షేక్ సిద్ధిక్, హీనాలు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె నిజ ఫాతిమా (4) స్థానిక అంగన్‌వాడీ స్కూల్‌కు వెళుతోంది. వారం రోజులుగా తీవ్రమైన జర్వంతో బాధపడుతూ పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. పలమనేరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగీ అని తెలియడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో చిన్నారి మరణించింది. ఇటీవల కాలంలో వికోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో డెంగీతో నలుగురు చిన్నారులు మృతి చెందారు. మసీదు వీధిలోని ఐదునెలల చిన్నారి, సత్యసాయినగర్‌కు చెందిన మేఘన (13) డెంగీతో ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించింది. గాండ్లపల్లి కొత్తూరుకు చెందిన రెండు సంవత్సరాల చిన్నారి జ్వరంతో బాధపడి రెండు రోజుల క్రితం తుదిశ్వాస విడిచింది. ఆదివారం ఉదయం బాపూజీ వీధికి చెందిన నిజ ఫాతిమా డెంగీ జర్వంతో చనిపోయింది.

విష జ్వరాలతో బెంబేలు

- ఇప్పటికే నలుగురు చిన్నారులు మృతి
- దోమల నివారణ చర్యలు నామమాత్రం
- వికోటలో ఆస్పత్రులు కిటకిట

ప్రజాశక్తి -వికోట : మండలంలో విష జ్వరాలు ప్రబలు తుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వికోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల కాలంలో డెంగీ జ్వరాలు, విష జ్వరాలతో నలుగురు చిన్నారులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నాయి. మసీదు వీధికి చెందిన ఐదు నెలల చిన్నారి జ్వరంతో మృతి చెందింది. సత్యసాయినగర్‌కు చెందిన మేఘన (13) డెంగీతో ఆస్పత్రిలో పోరాడి మృత్యువాత పడింది. గాండ్లపల్లి కొత్తూరుకు చెందిన రెండు సంవత్సరాల చిన్నారి జ్వరంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం తుది శ్వాస విడిచింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బాపూజీ వీధికి చెందిన నిజ ఫాతిమా (4) బాలిక డెంగీతో పోరాడి వేలూరు సిఎంసి ఆస్పత్రిలో మృత్యువాత పడింది. ఇటీవల కాలంలో చిన్నారులు మృత్యువాత పడుతుండడంతో మండల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలు స్థానిక ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రిలో తగ్గక పోవడంతో వైద్యులు బెంగళూరు, తిరుపతి, వేలూరు సిఎంసి తదితర పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో బిల్లులు చెల్లించలేక పిల్లల ఆరోగ్యం మెరుగుపడక ప్రజలు అల్లాడుతున్నారు. ఇన్ని సంఘటనలు జరిగిన తర్వాత సైతం పంచాయతీ వారు పారిశుధ్య పనులు సాగించడం, ఆరోగ్య శాఖ వారు గణాంకాల వివరాలు సేకరించడంలో హడావిడి చేస్తున్నారు తప్ప ఎలాంటి వైద్య సౌకర్యాలు అందించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగమ్మ ఏరు, ముదిమడుగు, కట్ట కాలువ, కాజీపేట కాలువ, కీలపల్లి చెరువు సమీప ప్రాంతాల్లో మురుగునీరు కాలువలు పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల దోమలు ఉత్పత్తి పెరిగి రోగాలు ప్రబలుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ వాసులు తమ ఇళ్లలోని మరుగుదొడ్ల నీళ్లను వ్యర్థాలను గంగమ్మ ఏరులోకి మళ్లించడంతో దోమలు ప్రబలేందుకు మరో కారణంగా ప్రజలు భావిస్తున్నారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ట్యాంకులను పరిశుభ్రం చేసి ప్రజలకు నాణ్యమైన నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మృతి చెందిన మేఘన (ఫైల్ ఫొటో)

మృతి చెందిన నిజ ఫాతిమ(ఫైల్ ఫొటో)

యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే

డెంగీ నివారణపై అధికారులు వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. వికోట మండలంలో వారం రోజులలో ఇద్దరు చిన్నారులు డెంగీతో మృతి చెందడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. వికోటలోని బాపూజీ వీధికి చెందిన నిజ ఫాతిమా డెంగీతో ఆదివారం మృతి చెందడంపై ఆయన తీవ్ర ఆందోళన చెందారు. అధికారులు వెంటనే పారిశుధ్య చర్యలతో పాటు డెంగీ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ విషయమై కలెక్టర్ తోపాటు జిల్లా వైద్యశాఖ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నామమాత్రంగా చేపడుతున్న పారిశుధ్య చర్యలు

డెంగీ నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

వికోట మండలంలో డెంగీ జ్వరాలు విస్తరిస్తున్నాయని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించడం వల్ల జ్వరాల విస్తరిస్తున్నాయని వాటిని కట్టడి చేయాలి.

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక మెసానికల్ క్రీడామైదానంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడాపోటీల్లో ఉపాధ్యాయినిఉపాధ్యాయులు ఉత్సహంగా పాల్గొన్నారు. షాట్‌పుట్, జావిలిన్‌త్రో, కిక్రెట్ ఇతర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, డివిజన్ కేంద్రాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ విద్యార్థులకు ఉత్తమ బోధనంతో పాటు ఉపాధ్యాయుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసం ఆట విడుపుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, షిరినా, శేఖర్‌బాబులతో పాటు ఉపాధ్యాయినిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

జిల్లా పంచాయతీ అధికారిగా నాగేశ్వర్ నాయక్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా పంచాయతీ అధికారిగా నాగేశ్వర్ నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను నియమించారు. చిత్తూరులో కమిషనర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ అరుణను కృష్ణా జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా జిల్లా పరిషత్ సీఈఒగా విధులు నిర్వహిస్తున్న గ్లోరియా బదిలీ కావడంతో జెడ్పి సీఈఒగా రవికుమార్ నాయుడును నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు

జయశంకర్‌ను సన్మానిస్తున్న ఎస్‌వియు విసి అప్పారావు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య సికె.జయశంకర్ ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో చోటు సంపాదించడం పట్ల ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆచార్య జయశంకర్ వరుసగా ఐదవసారి ప్రపంచంలోని టాప్ 2శాతం శాస్త్రవేత్తలలో ఒకరుగా నిలిచినట్లు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం సర్వే కనుగొందని తెలిపారు. ఈయన చిత్తూరు జిల్లా గుడిపాల మండలం చలిచిమలపల్లిలో జన్మించి ప్రభుత్వ కళాశాలలో చదివారు. జయశంకర్ ప్రపంచంలోని 6,459 మంది శాస్త్రవేత్తలలో 3,777, భారతదేశంలోని 129 మందిలో 56 మంది ర్యాంక్‌లు పొందారు. అలహాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలో, ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోనిక్స్, లేజర్ మెటీరియల్స్, గ్లాస్ సైన్స్, టెక్నాలజీలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. వీరు 335 పరిశోధనా పత్రాలను ప్రచురించాడు. వీరి పర్యవేక్షణలో 34మంది విద్యార్థులు పిహెచ్‌డి పొందారు. వీరు యుయస్, యూరప్, మెక్సికో, ఆసియా దేశాలను కూడా వివిధ హోదాలలో సందర్శించాడు. గూగుల్ స్కాలర్ సైటేషన్ ప్రకారం, అతని పత్రాలు 14,558 సార్లు హెచ్-ఇండెక్స్ 69తో ఉదహరించబడ్డాయి. అనేక సైంటిమెట్రిక్ విశ్లేషణలలో నిమగ్నమై ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం..!

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'పర్యావరణ పరిరక్షణలో మేము సైతం..!' అంటూ చిత్తూరు సైకిలిస్టు అసోసి యేషన్ ఆరోగ్యం కోసం సైకిల్ వాడకం ఎంతో ప్రయోజన మని పేర్కొన్నారు. ప్రపంచ కార్‌డే పురస్కరించుకొని గాంధీ విగ్రహం ఎదుట పర్యవరణ పరిరక్షణ కోసం సైకిల్‌ను ఉపయోగించాలని సూచిం చారు. మోటారు వాహనాల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని అవసరానికి మించి మోటారు వాహ నాలను వాడటం మానుకోవాని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకిలిస్టులు భరత్‌రెడ్డి, జయంత్, సురేంద్రరెడ్డి, సునీల్, వినోద్‌లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలంటున్న సైకిలిస్టులు

అక్రమ గ్రానైట్ మైనింగ్

- దుర్గరాజపురం ఓకే క్వారీలో లక్షల్లో అక్రమార్జన
- స్పందించని అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: మండలంలో ఒకే గ్రానైట్ మైనింగ్ క్వారీలో అక్రమార్కులు యథేచ్ఛగా లక్షల రూపాయల ఆదాయం అక్రమంగా ఆర్జిస్తున్నారని, అధికారులు ఏ మాత్రం పట్టించు కోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలోని పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురం వద్ద క్వారీ వుంది. రెండు నెలల నుంచి అక్కడ మైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఎలాంటి పరిమితులు, మైనింగ్ లైసెన్సు లేకుండా లక్షల రూపాయలు విలువ చేసే గ్రానైట్ పనులు చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో క్వారీల స్థానిక తహశీల్దారు అధ్యక్షతన మైన్స్ నుంచి ఒక అధికారి, సర్వేయర్‌తో కలిసి ఒక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బృందం మండలంలో దాదాపు 39 క్వారీలు ఉన్నట్లు నివేదికను జిల్లా మైన్స్ అధికారులకు అందించారు. అందులో 15 క్వారీలు మాత్రమే పని చేస్తున్నట్లు అధికారుల ప్రత్యేక నివేదికలో తెలిపారు. మండలంలో దుర్గరాజపురం, పద్మాపురం ప్రాంతాల్లో జరుగుతున్న గ్రానైట్ మైనింగ్‌ల గురించి జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వలేదు. రికార్డుల్లో కనపరచలేదని సమాచారం. అక్రమంగా పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురంలో ఒక్క గ్రానైట్ క్వారీ సర్వేలో, రికార్డులో కనపరచక పోవడంతో అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు నెలల్లో అక్రమ తరలింపులు చేశారు. భారీ దిమ్మె రాళ్ల లారీలను అధికారులు దృష్టికి తీసుకువచ్చినా స్థానిక అయినా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం గమనార్హం. చిత్తూరు జిల్లా మైనింగ్ అధికారులు సైతం నిర్లక్ష్యం చూపడంతో అక్రమార్కులకు అడ్డే లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు 50 సెంట్లు భూమిలో 40 అడుగుల లోతు గ్రానైట్ రాయితీ పనులు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రోజుకు ఆరు నుంచి ఎనిమిది గ్రానైట్ రాళ్ల లారీలు గ్రామాల మీదుగా చిత్తూరుకు అటు తమిళనాడుకు బహిరంగంగా తరలి వెళుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు మాత్రం లారీలను పట్టించుకోవడం మానేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దుర్గరాజపురంలో యథేచ్ఛగా సాగుతున్న క్వారీ పనులు

నివేదికలో తప్పించారు.. ఎందుకో?

ఎన్నికల అనంతరం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మైన్స్ వివరాలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన సర్వేలు అప్పటి అధికారులకు కాసులు పంట పండించిందని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన టీంలో అప్పటి ఎన్నికల కోసం వచ్చిన తహశీల్దారు, మైన్స్ అధికారి, స్థానిక సర్వేయర్‌తో కలిపిన ఈ బృందం మండలంలో జరుగుతున్న క్వారీలను పరిశీలించి వాటిపై నివేదిక అందించే సమయంలో ఎన్నికల కోసం వచ్చిన తహశీల్దారులకు బదిలీలు రావడంతో కొంతమంది క్వారీల యజమానుల వద్ద చేతివాటం చూపి దుర్గరాజపురం క్వారీ పనులను నివేదిక నుంచి తొలగించారు. దీంతో దుర్గరాజపురం క్వారీ విషయం ఇటు మండల లెక్కల్లోనూ, డిడి చిత్తూరు మైన్స్ అధికారులకు పంపిన నివేదికలో లేక పోవడంతో దుగ్గరాజపురం క్వారీలో గ్రానైట్ దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ క్వారీ దిమ్మె రాళ్లును తీస్తున్న క్వారీ

క్వారీల విషయం తెలియదు..

ఆఫీసులో సంబంధిత క్వారీకి సంబంధించి నివేదిక లేదు.. గతంలో సర్వే చేసిన వన దుర్గాపురం క్వారీ సర్వే నివేదిక ఆఫీసులో పెట్టలేదు, మా వద్ద సమాచారం లేదు. స్థానిక వీఆర్‌వోను అడిగి తెలుసుకుంటాను. ఇప్పుడే నాకు సమాచారం తెలిసింది.

- అమరనాథ్, తహశీల్దారు, ఎస్ఆర్‌పురం మండలం.

మా లిస్టులో దుర్గరాజపురం క్వారీ లేదు..

మండల వారీగా ప్రస్తుతం మండలంలో జరుగుతున్న క్వారీల జాబితాలో దుర్గరాజపురం క్వారీ లేదు. క్వారీలో ఉన్న జాబితాలే సక్రమమైనవి లేకపోతే అది అక్రమ గ్రానైట్ క్వారీనే అవుతుంది..

- ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ .

అనుమతి లేని టపాకాయలు స్వాధీనం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ :

కుప్పం మండలం ఆవులనత్తం గేటు గ్రామ పరిధిలో అక్రమంగా నిలువ ఉంచిన టపాకాయలను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ జి టి నాయుడు తెలిపారు. ఆవులనత్తం గేటు గ్రామ పరిధిలో మునస్వామి తన ఇంటిలో టపాకాయలను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచారని గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారు 70 వేల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీపావళి పండుగ దగ్గర పడుతున్న వేళ వ్యాపార నిమిత్తం ముందుగానే టపాకాయలను తీసుకువచ్చి ఇంటిలో నిలువ చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు.

రామసముద్రం ఎంపీడీవో రమణ మృతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: రామసముద్రం ఎంపీడీఓ బి రమణ ఆదివారం ఉదయం ఆయన ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. బైరెడ్డిపల్లి మండలం కేంద్రంలో దళిత కుటుంబంలో పుట్టిన ఆయన చిన్నప్పటినుండి కష్టపడి చదివి ఎంపీడీవో స్థాయికి ఎదిగారు. రమణ సీనియర్ అసిస్టెంట్‌గా 1986లో కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించారు. అనంతరం గుడిపల్లి, బంగారు పాలెం, బైరెడ్డిపల్లి, తవణంపల్లి మండలాలలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ 2024లో రామసముద్రం మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో నిత్యం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటి కప్పుడు పై అధికారులు, ప్రభుత్వ సూచనలు, సలహాలను పాటిస్తూ, సమస్యలు పరిష్కరించాలని అర్జీల రూపంలో తన వద్దకు వచ్చే పేదల సమస్యలను అప్పటికప్పుడే 90 శాతం పరిష్కరించి ప్రజల మన్ననలు, ప్రజాప్రతినిధుల అభినందనలు విశేషంగా పొంది మంచి పేరు సంపాదించారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. కుమారుడు ఇటీవల కరోనా సమయంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మండల టీడీపీ నాయకులు కిషోర్ గౌడ్, సుబ్రహ్మణ్యం తదితరులతో కలసి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేష్ ఉపాధ్యక్షులు చలపతి, రామసముద్రం మండలం ఎంపీటీసీ రామచంద్రా రెడ్డి, మినికి పంచాయతీ సర్పంచ్ సుబ్బారెడ్డి, రామసముద్రం మండల పంచాయతీ కార్యదర్శులు, మండల పత్రిక విలేకరులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రామసముద్రం ఎంపిడివో రమణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

23న శ్రీవారి ఆలయంలో శాంతి హోమం

- శ్రీవారి లడ్డూ ప్రసాదాల నాణ్యతపై భక్తుల సంతృప్తి
- టీటీడీ ఈవో జె శ్యామల రావు

ప్రజాశక్తి- తిరుమల: ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల శ్రేయస్సుతో పాటు లడ్డూ ప్రసాదాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23న శాంతి హోమం నిర్వహించనున్నట్లు టిటిడి ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో, అదనపు సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా శ్రీవారి నైవేద్యంలో వాడే నెయ్యిలో కల్తీ ఉందని గుర్తించామన్నారు. సర్వపాప పరిహారార్థం, భక్తుల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు తిరుమల యాగశాలలో శాంతి హోమం నిర్వహించాలని టీటీడీ నిర్ణయించినట్లు తెలిపారు. ఇదివరకే ఆగస్టు 15 నుండి 17వ తేదీ వరకు టీటీడీ మూడు రోజులపాటు పవిత్రోత్సవాలను ఆకమోక్తంగా నిర్వహించిందని, అయితే శ్రీవారి నైవేద్యంలో కల్తీ పదార్థాలు ఉన్నది గుర్తించినందున, అందుకు పరిహారణగా శాంతి హోమం నిర్వహించాలని ఆగమ సలహా మండలి నిర్ణయించినట్లు చెప్పారు. లడ్డూల రుచిని మెరుగుపరిచేందుకు టీటీడీ చేపట్టిన చర్యలను వివరిస్తూ, టీటీడీ ప్రస్తుతం ఆవు నెయ్యి కొనుగోలు విధానాన్ని పూర్తిగా మార్చివేసిందని, స్వచ్ఛమైన ఆవునేయిని ఎంతో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ సంస్కరణలతో ఇప్పుడు లడ్డూ ప్రసాదం రుచి అనేక రెట్లు మెరుగుపడిందని, భక్తులు కూడా ఎనలేని సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఈవో వివరించారు. జేఈవో వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, శ్రీరామకృష్ణ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిటిడి ఈవో శ్యామలరావు

ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకోవాలి

పద్మనాభం, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు గృహ నిర్మాణం కోసం రుణం మంజురు చేయడంతో పాటు ఇంటి స్థలం మంజూరు చేసిందని, ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంలో మంజూరు చేసి ఇచ్చిన స్థలంలోనే గృహాలను పూర్తి చేసుకోవడం వల్ల సొంత ఇంటి కల నెరవేరుతుందని, అసంపూర్ణంగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం సాయం అందిస్తోందని, లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెర్ పద్మనాభం తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గృహ నిర్మాణాలపై ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రజాశక్తి: జిల్లాలో మంజూరైన గృహాలెన్ని?

పీడీ: జిల్లాలో 77,366 ఇళ్లు లేని పేదల కోసం స్థలం, గృహ నిర్మాణానికి రుణాలు మంజురు అయ్యాయి. ఇందులో ప్రస్తుతానికి 47,324 ఇళ్లు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రజాశక్తి: వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

పీడీ: వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణాల పూర్తి చేసుకునేందుకు స్వయం సహాయ సంఘాల్లోని మహిళా సంఘాల్లో వ్యక్తిగత రుణం తీసుకొనే అవకాశం వుంది. ఉపాధి హామీ పని దినాలను ఉపయోగిచుకొనే వెసులు బాటువుంది.



ప్రజాశక్తి: ఇసుక సమస్య వుందా?

పీడీ: ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం ఇసుక అవసరం మేరకు సరఫరా చేసేలా ప్రభుత్వం నుండి ఆదేశాలు పంపాం.. ఇసుక రీచ్‌ల వద్ద ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం రవాణా ఖర్చులు మినహా ఒక్క పైసా ఖర్చు లేకుండా ఇసుక అందిస్తున్నాం. ఈనెల 28వ తేదీ నుండి ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు మన ఇల్లు మన గౌరవం పథకాన్ని ప్రారంభిస్తాం..

ప్రజాశక్తి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి?

పీడీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,68,450 గృహాలు మంజురు అయ్యాయి. ఒక్కో గృహానికి 1,80 వేలు యూనిట్ విలువగా నిర్ణయించారు.

ప్రజాశక్తి: నీటి వసతి కల్పించారా?

పీడీ: కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 1,039 లేఔట్‌లకు 847 లేఔట్లకు రూ.102 కోట్లు వ్యయంతో నీటి వసతి కల్పించాం.. సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం రూ.1,438.54 కోట్లు అంచనాతో ప్రతిపాదనలు పంపాం..

రాంభూపాల్ రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జిగా నియమితులైన రాంభూపాల్ రెడ్డికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కీ రాయల్ ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

స్కూలు బ్యాగులు పంపిణీ

బ్యాగులు పంపిణీ చేస్తున్న ఐఎంఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ జయప్రకాష్

ప్రజాశక్తి -సదుం: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థులకు జిల్లా ఎంఐఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ జయప్రకాష్ ప్రభుత్వ స్కూలు బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 దామోదరం, గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు జాఫర్‌పులి

6న ముస్లింల సమ్మేళనం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: అక్టోబర్ 6వ తేదీ చిత్తూరులో ముస్లింల ఐక్య వేదిక నేతృత్వంలో ముస్లింల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఐక్య వేదిక నాయకులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్‌పులి మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లింలను ఒక్కటి చేయడంతో పాటు ఐక్యత తీసుకొచ్చి సమస్యలపై పోరాటాలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు రషీద్, షౌకత్, ఇనాయతుల్లా, సయ్యద్‌నూర్, నిజాముద్దీన్‌లతో పాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కార్వేటినగరం : కార్వేటినగరం మండలం ముక్కారవాణి పల్లె ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వైదేహి సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ వైట్ ఫీల్డ్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో 169 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 108 మంది బిపి, షుగర్ పరీక్షలు చేసుకున్నారు. వారందరికీ ఉచితంగా మాత్రలు టానిక్స్ పంపిణీ చేసినట్లు శామంతి సురేష్ రాయల్, కోఆర్డినేటర్ లోకేశ్వర్ తెలిపారు. వీరిలో షుగర్, ఎంట్రాలజి, న్యూరాలజీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్లాసిక్ సర్జరీ అవసరం ఉన్న వారికి వైద్యనిపుణులతో చికిత్స నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరంలో బెంగళూరు వైద్యులు డాక్టర్ అనుజ, డాక్టర్ నిశాంత్, డాక్టర్ మోనిషా, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ లిఖిత్, డాక్టర్ లలిత, వైద్య సిబ్బంది ప్రవీణ్ రాజ్, దర్సన్, సంకేష్, నాన బాలు, కార్యనిర్వాహకులు శామంతి సురేష్ రాయల్, రూపేష్, మహేష్, ప్రసాద్, బాలాజీ, తిరుమలయ్య, వెంకటేష్, చందు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82 సంవత్సరం విద్యాభ్యాసం చేసి పదవ తరగతి లో క్లాస్‌మేట్ అయిన పూర్వ విద్యార్థులు అందరూ కలసి తమ గురువులు సన్మానం చేసి విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకున్నారు. వీరికి విద్యాభ్యాసం చేసిన పలువురు ఉపాధ్యాయులు కాలం చెల్లడంతో వారందరినీ తలుచుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించి స్మరించుకున్నారు. అనంతరం తమ చిన్ననాటి అనుభవాలను ఒకరినొకరు విద్యార్థులు పంచుకొని ఉపాధ్యాయుల వద్ద తాము చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

నీళ్లు లేక నిలబెట్టేశారు!

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా అనేక ప్రాంతాలలో భారీ విగ్రహాలను వీధులలో ప్రతిష్టించి పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచి ఆఖరి రోజున విగ్రహాలను నిమజ్జనం చేశారు. అయితే పలు ప్రాంతాలలో చెరువులలో నీరు లేకపోవడంతో విగ్రహాలను నిమజ్జనం చేయలేక చెరువు మధ్యలో నిలిపి ఉంచి మమ అనిపించి వచ్చేశారు. వరుణ దేవుడు కరుణించకపోవడం చెరువులలో నీరు లేకపోవడంతో చేసేది ఏమీ లేక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయలేక చెరువు గట్టుమీద చెరువులో వదిలి నిమజ్జనం చేశామనిపించారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

కృషి విజ్ఞాన కేంద్ర మార్గానికి భూమి పూజ

ప్రజాశక్తి -శాంతిపురం: శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ తంబిగానిపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 66 చెక్కగుట్టలో కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో కృషి విజ్ఞాన కేంద్రం నిర్మించనున్నారు. ఇందుకు ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రానికి రహదారి నిమిత్తం రహదారి పనులకు భూమి పూజ చేసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మెళకువలు అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా జిల్లాలోని రైతుల సాంకేతిక, ఆర్థిక అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. నూతన పరిశోధనలు చేసి, నూతన వంగడాలను పండించి అందించడమే కాకుండా క్షేత్ర పరిశీలనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, పత్రిక మాధ్యమాల ద్వారా సలహాలు, సూచనలు అందించడం ద్వారా రైతులకు సేవ చేస్తున్నాయన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎస్ మునిరత్నం, గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ వెంకటేష్, సత్యేంద్ర శేఖర్,గోపీనాథ్, విశ్వనాథ నాయుడు, వివి నాగరాజు, ఆర్ఎస్ మణి, చంద్రశేఖర్, విజయకుమార్ రెడ్డి,ఉదయ్ కుమార్, ఉమాపతి జయరాం రెడ్డి,దద్దు, గిరిధర్, ఎంసి నాగరాజు,రమేష్, ఆంజనేయ రెడ్డి పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల నిమిత్తమే ట్రాన్స్‌కో: డిఈఈ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రజల అవసరాలను తీర్చేందుకు ట్రాన్స్ కో ఉంటుందని ట్రాన్స్‌కో డిఈఈ కొండయ్య అన్నారు. మండలంలోని గుండ్ల కట్టమంచి గ్రామంలో విద్యుత్ పనులు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు విద్యుత్ సరఫరా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాలో చేపట్టిన దశ ప్రత్యామ్నాయంగా కొత్త మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామస్తులకు విద్యుత్ సరఫరా చేయడమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ మ్యాన్ దిలీప్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని చోరీలు

- ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు అపహరణ
- నిద్రావస్థలో పోలీసులు
- రైతుల గగ్గోలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీలు ఆగడం లేదు. పోలీసులు నిద్రావస్థలో వుండడంతో రైతులు తమ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండాపోయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ జరిగిన సంఘటన వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతులు న్యాయం కోసం , దొంగలను పట్టుకోవాలని పోలీస్ స్టేషన్ గడప ఎక్కారు. వేసిన పంట సకాలంలో వర్షాలు లేక చేతికి అందక , కుటుంబ ఖర్చులకు రాక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి, ఆయిల్ చోరీ వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వెదురు కుప్పం మండలం ఎగువ బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బండి కృష్ణారెడ్డి, తండ్రి బండి వెంకట్ రెడ్డిలకు చెందిన పొలం బ్రాహ్మణపల్లి అనుపల్లి ప్రధాన రహదారి పక్కనే వున్న పొలంలో 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్ వైరు, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఎవరూ లేని సమయం చూసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును అపహరించుకొని వెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అధికారుల స్పందించి కాపర్ వైర్‌ను చోరీ చేసిన వ్యక్తులను గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా చోటుచేసుకున్నాయి. పోలీసులు ఒక్కటీ ఛేదించలేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుండగులు దొంగతనాన్ని వదలడం లేదని, పోలీసులు వారిని గుర్తించి పట్టుకోవడంలేదని, చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి దొంగతనాలు పునరావృతం అవుతున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీకి గురైన దృశ్యం

పోలీసులకు ఫిర్యాదు చేశాం..

బ్రాహ్మణపల్లి ఘటనపై వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాం.. రైతుల పంట పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను గుర్తించాల్సిన అవసరం వుంది.

- రామాంజనేయులు కరెంట్ ఏఇ, వెదురుకుప్పం మండలం.

త్వరలో పట్టుకుంటాం..

పోలీస్ సిబ్బందిని ఒకటి టీమ్‌గా ఏర్పాటు చేసి , అనుమానం ఉన్న చోటికి పంపించాం, ఈ ఘటనకు సంబంధించి కొన్ని విషయాలు సేకరించాం..త్వరలోనే దుండగులను పట్టుకుంటాం..

- హనుమంతప్ప , కార్వేటినగరం సీఐ.

వేసవిని తలపిస్తున్న ఎండలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు- ఎండుతున్న వర్షాధార పంటలు- అయోమయంలో రైతులు

ప్రజాశక్తి- పలమనేరు: ప్రస్తుతం మండలంలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగుంటున్నాయి. వర్షాధార పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో మండల రైతులు దిక్కుతోచని స్థితిలో అయోమయంలో పడ్డారు.

పలమనేరు మండలంలో ప్రధాన వర్షాధార పంటగా వేరుశనగను విస్తారంగా సాగు చేస్తారు. ప్రస్తుతం మండలంలో సుమారు 450 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ప్రస్తుతం పంట బుడ్డ దశలో వుంది. . ఈ స్థితిలో వర్షం లేక ఎండుతున్న పంటలకు తోడు సూర్యుడు ప్రతాపం, వేడి గాలులతో భూగర్భ జలాలు అడుగంటి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బోరు బావులు నీరు లేక ఉద్యాన పంటలు ఎండిపోతున్నాయి. వేరుశనగ పంటలు మలమల మాడుతున్నాయి. రైతుల ఆశలు పూర్తిగా ఆవిరవుతున్నాయి. పంటలు పూర్తిగా ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడుల పూర్తిగా దక్కని పరిస్థితి నెలకొంది. వేరుశనగ పంటను రక్షించాల్సిన వ్యవసాయ శాఖ ఏ మాత్రం స్పందించడంలేదు. కనీస రక్షణ చర్యలు సైతం చేపట్టిన దాఖలాలు లేవు. జల పిరంగులు, తుంపర సేద్యం వంటి పరికరాలు, నీటి సరఫరా గొట్టాలు, తదితర వాటిని గతంలో ప్రభుత్వం విరివిగా అందించి ఆదుకుంది. నిర్వహణ బాధ్యతలను వ్యవసాయ శాఖకు అప్పగించింది. ఈ పరికరాలు కావలసిన వారు వ్యవసాయ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకుని తీసుకొని వాడుకొని అనంతరం పరికరాలను వ్యవసాయ శాఖ అధికారికి అప్పగించాల్సి వుంది. పరికరాలను స్వాధీనం చేసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై వుంది. అయితే వ్యవసాయ అధికారుల వద్ద ప్రస్తుత పంట వివరాలు వ్యవసాయ పరికరాలు, తదితర వివరాలు ఏ మాత్రం అందుబాటులో ఉండటం లేదు. ఆధునిక విధానాల్లో ఉద్యాన పంటలు వృద్ధి, తదితర వాటిపై అధికారులు ఏ మాత్రం స్పందించడంలేదు. పరికరాలు ఎవరి వద్ద ఉన్నాయో? కనీసం సమాచారం సైతం లేదు. వేరుశనగ పంటలే కాకుండా టమోటా, బీన్స్, క్యాబేజ్, కాకర, బీర, సొర, బంగాళదుంప, చిక్కుడు, దోస, బంతి, చామంతి పూలు వంటి వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ పంటలు సైతం ఎండిపోతున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు పంట రక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. జూన్ మొదట్లో, జులై మధ్యలో తేలికపాటి వర్షాలు కురిశాయి. , ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరుణుడు పూర్తిగా కనికరించలేదు. చినుకు సరిగా పడకపోవడంతో పంటలు పూర్తిగా ఎండి మాడిపోయే దశకు చేరుకున్నాయి. కనీసం రైతుల దారుణ పరిస్థితిపై అధికారులు దృష్టిసారించలేదు. ఎండ తీవ్రత ఇలాగే కొనసాగితే రైతుల పంటలు పూర్తి దశలో ఎండి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం వుంది. అధికారులు వెంటనే స్పందించి రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ సహాయక చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

'అంబేద్కర్ బ్యానర్ చించివేత అన్యాయం'

ప్రజాశక్తి -పుంగనూరు: వినాయక మండపం వద్ద కట్టిన అంబేద్కర్ బ్యానర్ ను చింపడం చాలా అవమానకర నియమైన సంఘటనని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిన్నటి దినం పశ్చిమ గోదావరి జిల్లా "ఉండి "ఎంఎల్ఏ రఘురామ రాజు వినాయక మండపానికి ఎదురుగా అంబేద్కర్ బ్యానర్ కట్టారని దాన్ని ఆయన తన కార్యకర్తల మెప్పు కోసమో లేక మరేదైనా కారణమో తెలియదు కాని అంబేద్కర్ బ్యానర్ ను చింపి పారేశారని ఆరోపించారు. కనీసం గౌరవం లేకుండా ఇలా చెయ్యడం ఘోరమని, ఇలాంటి వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని , కాకినాడ రూరల్ ఎంఎల్ఏ పంతం నానాజీ దళిత హెచ్ ఓ డి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర రావు(దళిత వర్గం) ఆయనను తన అనుచరులతో కలిసి చెప్పలేని నానా మాటలతో అవమానించారన్నారు. ఆయనను మాస్క్ తీసి అనుచరులు కొడుతున్నా చోద్యం చూస్తున్న ఎంఎల్ఏ పంతం నానాజీ మీద కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన పై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఎల్ఏ గా బర్తరఫ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, ఏడూరు శ్రీనివాసులు, నాగ, ఈశ్వర్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి- పూతలపట్టు:

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం సాయంత్రం పూతలపట్టు మండల నాయకులు జగదీశ్వర్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో వైసిపి పరిస్థితులపై చర్చించుకున్నట్లు సమాచారం. అంతకు ముందుగా మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు బాలాజీ కళ్యాణ మండపంలో గత రెండు రోజుల క్రితం కో ఆప్షన్ మెంబర్ పై జరిగిన దాడి సంఘటనపై ఆ పార్టీ కార్యకర్తలతో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు.

పేదల సేవలో సాయి మాత సేవా ట్రస్ట్

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం సాయి మాత సేవ ట్రస్ట్ వారు విరాళాలను సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి, విద్యార్థుల సాయంతో ప్రజల వద్దకే వెళుతూ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు అందజేసిన సహాయాన్ని సాయి మాత సేవ ట్రస్ట్ నేరుగా వరద బాధితులకు అందజేస్తుందని తెలిపారు.

భూములిచ్చిన రైతుకే ఉరివేస్తారా..?

- చిత్తూరు- తచ్చూరు హైవేపై వంటవార్పు
- అధికారులు దిగొచ్చి రైతుల కష్టాలు చూడండి
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరిక

వంటావార్పులో పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): చిత్తూరు–తచ్చూరు హైవే రోడ్డును చూస్తే భూములిచ్చిన రైతుకే ఉరివేస్తున్నట్లు అనిపిస్తున్నాయని, భూములు తీసుకునే ముందు అధికారులు ఇచ్చిన మాటలను నిల బెట్టుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ఆదివారం హైవేకు భూమి లిచ్చిన రైతులతో కలిసి, నగరి సమీపంలో చిత్తూరు–తచ్చూరు హైవేపై వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చిత్తూరు–తచ్చూరు హైవే పక్కన పంట పొలాలకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో కోరినా అధికారులు ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. హైవేకు పక్కన సర్వీస్ రోడ్డు వేసేంత వరకు పనులు జరగడానికి వీలేదన్నారు. చిత్తూరు– తచ్చూరు మధ్య హైవే రోడ్డు వేయడం మంచిదే...కానీ హైవేకు భూములు ఇచ్చిన రైతు పొలాలకు వెళ్లడానికి వీలులేకుండా సర్వీస్ రోడ్డుకు ఇరుపక్కల 5 అడుగల ప్రహరీ గోడలు నిర్మించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది రైతులను ఉరితీయడమే..' అంటూ ఆయన మండి పడ్డారు. రైతు పండిన పంటలను తరలించడంలో రైతులు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచిం చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నగరి మండల కార్యదర్శి కోదండం రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మండలంలోని పెంగరగుంట పంచాయతీ కేంద్రంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన ప్రగతి పై వివరించారు. పలమనేరు నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలపై తెలిపారు. పలమనేరు మండలంలోని ముసలమడుగు వద్ద రూ.18 కోట్లతో కుంకి ఏనుగుల టూరిజం హబ్ ఏర్పాటు , నియోజకవర్గ కేంద్రంలో రూ. 200 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, సర్పంచ్ భువనేశ్వరి నక్షత్రయ్య, పార్టీ అధ్యక్షులు నాగరాజు రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్,నాయకులు బాలాజీ నాయుడు, మల్లీశ్వర్ రెడ్డి,రామచంద్ర నాయుడు, వెంకట ముని రెడ్డి, సెల్వరాజ్, రామ్మూర్తి నాయుడు, హేమ గిరి, రామచంద్ర, అమరనాథ రెడ్డి, స్వతంత్ర బాబు, పెద్దబ్బ, హరిలతో పాటు మండల శాఖా అధికారులు పాల్గొన్నారు.

'కళ్యాణోత్సవానికి తరలిరండి..'

ప్రజాశక్తి- కుప్పం రూరల్ :

కుప్పం మండల పరిధిలోని వేటరాజస్వామి దేవస్థాన ప్రాంగణంలో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించబోయే కళ్యాణోత్సవానికి భక్తులు కదలి రావాలని ఆలయ అర్చకులు ప్రతాప్ సింహ కోరారు. పెరటాసి మాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి ఎస్ మునిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 సంవత్సరం నుండి బేటరాయ స్వామి దేవాలయ ప్రాంగణంలో టిటిడి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాంటిది గత ప్రభుత్వ హయాములో ఐదు సంవత్సరాల కాలంలో కేవలం ఒక్కసారి మాత్రమే కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం బాధాకరమన్నారు.పెరటాసి మాసం మూడవ శనివారం సందర్భంగా అక్టోబర్ 5వ తేదీన కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 వేల మంది భక్తులు పాల్గొన్న నున్నట్టు అంచనా వేశారు. వీరందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

కౌండిన్య నదిపై వంతెన నిర్మించండి..

ఎమ్మెల్యేకి రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి -పలమనేరు: మొసలి మడుగు గ్రామ సమీపంలోని కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే అరమనాద రెడ్డికి రైతు సంఘం నాయకులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పలమనేరు రూరల్ మండలం లోని మొసలి మడుగు గ్రామ సమీపంలోని కౌండిన్యా నదికి ఇరిగేషన్ డిపార్టుమెంటు గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. వర్షాకాలంలో కౌండిన్యానది ప్రవహించే సమయంలో నదికి ఆనుకుని ఉన్న రైతుల వ్యవసాయ పంటపొలాలపై నెలలు తరబడి భారీ నీటి ప్రవాహం కారణంగా పంట నష్టాలతోపాటు సారవంతమైన భూములు కూడా కోతకుగురై కొట్టుకుపోయి బండరాళ్లు తేలిపోయి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వంలో నదిలో నీటి నిలువ వుండేందుకు కొన్ని చెక్ డ్యాములు ఎత్తు పెంచే దశలో ఇరిగేషన్ డిపార్టు మెంటు వారు పరిశీలించి పక్కనున్న పంట పొలాలపై నీరు వెళ్లకుండా సిమెంటు తో నిర్మాణం చేపట్టిన తరువాతనే చెక్ డ్యాం ఎత్తు తగినంత పెంచాలని నిర్ణయిం చారన్నారు. అయితే నిర్మాణం చేపట్టే క్రమంలో అవన్నీ మరచి మొదట చెక్ డ్యాం ఎత్తును 2 అడుగులకుపైన పెంచి పక్కనున్న పంటపొలాలపై ప్రవహిస్తున్న కౌండిన్య నీటికి సిమెంటు నిర్మాణం చేపట్టకనే ఆపేశారని తెలిపారు. అప్పటికే ఎలక్షన్ కోడ్ దగ్గర రావడంతో బిల్లులు రావనే ఉద్దేశంతో అలాగే వదిలేయడంతో అప్పటినుండి గత ఏడేళ్లుగా వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కౌండిన్య నదిలో ప్రవహించే నీరంతా పంట భూములపైనే నెలల తరబడి 15 అడుగుల ఎత్తుకుపైగా నీటి ప్రవాహము ప్రవహిం చడమే కాకుండా సారవంతమైన భూములు కూడా కోతకుగురై వ్యవసా యానికి పనికిరాకుండా బండరాళ్లు తేలిపో తున్నాయన్నారు. 12 అడుగుల లోతుకు పైగా బావులుగా మారి పెద్ద పెద్ద గుంతలు, వాగులు వంకలుగా మారాయన్నారు. ఈ గుంతలు పూడ్చడానికి లక్షలు ఖర్చు అవుతుందని, ఇంత ఖర్చులు రైతులు భరించలేక బీడు భూములుగా వదిలేశారని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి రైతుల పంటపొలాలపై నీళ్లు వెళ్ళకుండా సిమెంటుతో నిర్మాణం చేపట్టేందుకు కృషి జిల్లా రైతుసంఘం తరపున కోరు తున్నామన్నారు.

క్రైం న్యూస్

16 మందికి జరిమానా

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిని పట్టుకుని కోర్టుకు తరలించారు. వారికి కోర్టు జరిమానా విధించింది. ఎస్పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్‌పి సాయినాథ్ ఆధ్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు శనివారం వాహన తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందిని గుర్తించి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టుకు తరలించారు. జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం ఒక లక్షా 60వేల రూపాయలు జరిమానా విధించారు. 9 నెలల వ్యవధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 322 మందికి సుమారు 27 లక్షల రూపాయల ఫైన్ విధించామని చిత్తూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

'పిఎం ఉపాధి కల్పన'ను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకంను అర్హులైన వారు సద్విని యోగం చేసు కోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రక్రియలో తెలిపారు. ఈ నెల 26 న ఈ పథకానికి సంబంధించి జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమ నిర్వహణ డిఆర్డిఏ సమావేశపు మందిరంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు విధానం, సబ్సిడీ, అర్హత గల యూనిట్ల వివరాలు సంబంధింత అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు, ఆసక్తి వున్న వారు అవగాహన సదస్సులో పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బిపి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి - కుప్పం టౌన్: బిగ్ టీవీ ఆధ్వర్యంలో కుప్పం పట్టణం ఎన్టీఆర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం స్థానిక బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సురేష్ బాబు సాయంతో శనివారం నిర్వహిం చారు. ప్రజలకు వైద్య పరీక్షలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా హాజరైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బిపి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎస్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, మాజీ మార్కెట్ యాడ్ కమిటీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్ , మాజీ ఎంపిటిసి సుధాకర్, వైస్ సర్పంచ్ సోము, బూత్ ఇన్‌ఛార్జి రవి , స్థానిక టిడిపి రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా ఈ నెల 27వ తేదిన శుక్రవారం స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం గుణశేఖర్ రెడ్డి తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు రసూల్ (6300954441), ధనంజయులు (7993502145) ఫోను నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చంద్రబాబు తోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్ కండ్రిగ పంచాయతీలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి మంచి పాలన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు , టిడిపి సీనియర్ నాయకులు చంద్ర ప్రకాష్ , పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ , పార్టీ మండల అధ్యక్షులు శశికర్ బాబు , మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు , కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లె ధర్మరాజుల ఆలయం లో ఆదివారం 1999 – 2000 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ కు సంబంధించిన విద్యార్థులు 24 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు .తరువాత ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఇక్కడ చదువుకొని వృత్తి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి ఒకరికి ఒకరు సంబంధాలు లేకుండా ఉండవచ్చునని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారి స్నేహ సంబంధాలు తిరిగి బలపడతాయని అన్నారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఇలా ఉన్నత స్థాయిలో ఉండడం చూస్తుంటే మాకు చాలా ఆనందంగా ఉందని, తాము నేర్పిన విద్యకు పరిపూర్ణత లభించిందని వారన్నారు. తర్వాత విద్యార్థులు వాళ్ల గురువులను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ విద్యానికేతన్ స్కూల్ మాజీ కరస్పాండెంట్ బండి పట్టాభి రెడ్డి, అప్పటి టీచర్లు గిరిబాబు, వినోద్ కుమార్, గోపాల్ రెడ్డి ,జానకిరామిరెడ్డి, పురుషోత్తం సుబ్రమణ్యం, దాము ,యుగంధర్ తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల నిరసన

ప్రజాశక్తి -పుంగనూరు: టిటిడి లడ్డూ తయారీలో కల్తీ నూనెలు కలిపారని వారికి పుట్టగతులు ఉండవని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ అన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన టిడిపి, జనసేన బిజెపి నాయకుల ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్లో ఆదివారం నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలకులు లడ్డూల తయారీలో నాణ్యత పాటించకపోవడం అన్యాయమన్నారు. దీన్ని నిరసిస్తూ దిష్టి మొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు మాధవరెడ్డి జనసేన మండల అధ్యక్షులు విరుపాక్షి, బిజెపి జిల్లా ఎస్సీ సెల్ నాయకులు నరసింహులు, టిడిపి నాయకులు, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, జనసేన జిల్లా ప్రోగ్రామ్ సెక్రెటరీ చైతన్య రాయల్, యువ నాయకులు దినేష్ ఐటిడిపి కుమార్ పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించండి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:

మండలంలోని కాలేపల్లి హైస్కూల్ స్థలంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలస్థితికి చేరుకుని విషసర్పాలకు నిలయంగా మారిన భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు. వరత్తూరు పంచాయతీ కాలేపల్లి గ్రామంలో సుమారు 35 ఏళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని నిర్మించారు. గ్రామ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ఈ కేంద్రం ఆలనా పాలన పట్టించుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. మోల్డింగ్ సిమెంట్ పెచ్చులూడగా వర్షాకాలంలో నీరు లోనికి ప్రవేశిస్తున్నాయి . ఈ భవనానికి సమీపంలో గల నివాస్తులు వారి ఇళ్ళలో చెత్తాచెదారంను తెచ్చి పాడుబడిన భవనంలో పడేస్తున్నారు . ఈ భవనం చుట్టూ పక్కపిచ్చి మొక్కలు పెరిగిపోవడంవల్ల విష సర్పాలకు నిలయంగా మారింది. పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాడుబడిన భవనాన్ని తొలగించుటకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.